www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 డిసెంబర్ 2025



పిజిఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఫోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చని తెలియజేశారు.

నాగలాపురం - విఆర్ కండ్రిగ రోడ్ల మరమ్మతులు చేపట్టండి

■ తిరుపతి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లాలోని నాగలాపురం-విఆర్ కండ్రిగ రోడ్ల మరమ్మతులను ప్రభుత్వం త్వరగా చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో తిరుపతి జిల్లా పూర్తిగా అతలాకుతలమైందన్నారు. ఈ పరిస్థితుల్లో రోడ్లు చాలా అధ్వానంగా దర్శనమిస్తున్నాయన్నారు. వర్షానికి రోడ్లు కోతకు గురై గుంతలమయమై పూర్తిగా దెబ్బతినిం దన్నారు. ఆటోలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రజలకు రవాణా అసౌక్యం కలిగే పరిస్థితి నెలకొందన్నారు. సోమవారం నాగలాపురం నుంచి కన్నావరం గ్రామానికి తాము చేరుకున్న నేపథ్యంలో ప్రయాణం నరకాన్ని తలపించిందన్నారు. విద్యార్థులు పాఠశాలలకు, కార్మికులు పనులకి, అత్యవసర పరిస్థితులలో ప్రజలు హాస్పిటల్ కి వెళ్లడానికి రోడ్ల దుస్థితి ఆటంకంగా మారిందని తెలిపారు. సత్యవేడు నియోజకవర్గంలోని రోడ్లు, పుత్తూరు-చెన్నై హైవే రోడ్డు, ఇలా కార్పొరేషన్ రోడ్ల నుండి గ్రామ స్థాయి రోడ్ల వరకు పూర్తిగా ధ్వంసమై ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగిస్తుందన్నారు. రోడ్ల మరమ్మత్తు, నిర్మాణానికి త్వరిత గతిన కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం రోడ్ల దుస్థితిని పట్టించుకోలేదని విమర్శించి, ఇప్పటి కూటమి ప్రభుత్వం రోడ్లను బాగు చేసే చర్యలను ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. మన రాష్ట్ర మంత్రులు అర్జీలు ఇవ్వడానికి మాత్రమే పరిమితం కాకుండా, నిధులు కేటాయించడానికి కృషి చేయాలన్నారు. కాబట్టి తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి రోడ్ల మరమ్మత్తులు చేపట్టి ప్రజల అసౌక్యాన్ని తొలగించాలని తిరుపతి జిల్లా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. తుపాను ప్రభావంతో పంట నీట మునిగి నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్ధన్, కమిటీ సభ్యులు వెంకటేష్ పాల్గొన్నారు.



రోడ్ల దుస్తితిని వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, నాయకులు

ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేవివి జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, జర్నలిస్ట్ నేతాజీ తదితరులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: 25వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని విద్యార్థిని, విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు శుక్ర, శని వారాల్లో వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. చిత్రలేఖనం, చదరంగం, షాట్స్, జానపద నృత్యాలు, అభ్యుదయ గీతాలు, డిబేట్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జేవివి జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, జర్నలిస్ట్ కే నేతాజీలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 13 14 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ 25వ మహాసభలు తిరుపతి, కచ్చపి ఆడిటోరియంలో జరగనున్నాయని తెలిపారు. మహాసభను జయప్రదం చేయడానికి, వివిధ సాంస్కృత కార్యక్రమాలు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటి విజేతలుగా నిలవాలని కోరారు. మహాసభలను జయప్రదం చేయడానాకి విద్యార్థిలోకం కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు మెలుగు రమేష్‌కు మాతృవియోగం

■ సిపిఎం జిల్లా కమిటీ ఘన నివాళి



జయమ్మ మృత దేహం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తదితరులు

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలం, సిపిఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి మెలుగు రమేష్ మాతృమూర్తి జయమ్మ (70) మృతి చెందారు. ఈ సందర్భంగా సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ జయమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. జయమ్మ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తుది శ్వాస విడిచారు. ఆమె స్వగ్రామమైన కన్నావరంలో ఆదివారం దహన క్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి జనార్ధన్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు విజయమ్మ, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, సత్యవేడు నియోజకవర్గ పార్టీ కార్మిక సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

హక్కుల సాధనకు
ఉపాధ్యాయులు ఐక్యం కావాలి



ప్రజాశక్తి - నాయుడుపేట: ఉపాధ్యాయులందరూ కలిసికట్టుగా నిలబడి ఆశయాల సాధనకై పోరాడాలని ఉపాధ్యాయ సంఘం యుటిఎఫ్ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా, నాయుడుపేట, కుమార్ మినీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన నాయుడుపేట, ఓజిలి, పెళ్ళకూరు మూడు మండలాల యుటిఎఫ్ సంఘం ఉపాధ్యాయులు కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలలో ఏ కార్యక్రమానికైనా ముందుండేది ఒక్క యుటిఎఫ్ సంఘం మాత్రమేనని ఈ కారణంగానే అన్ని సంఘాల కంటే యుటిఎఫ్ లోనే సభ్యత్వాలు ఎక్కువగా ఉన్నాయని తెలియజేశారు. ఈ సమావేశంలో భాగంగా మూడు మండలాలకు సంబంధించి నూతన అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు. నూతన యుటిఎఫ్ నాయుడుపేట సంఘానికి గౌరవ అధ్యక్షునిగా జి.శంకరయ్య, అధ్యక్షునిగా వి.వి.సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం రమేష్, ఎన్.ఎస్.శైలజ, ప్రధాన కార్యదర్శిగా ఏ.వి.రాజగోపాల్, కోశాధికారిగా ఓ.సురేష్ మరి కొంతమంది కార్యదర్శులుగా ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి మోహన్ బాబు, జిల్లా కార్యదర్సులు టి.గోవర్ధన్ రెడ్డి, కే.ప్రభాకర్, మస్తానయ్య, స్టేట్ కౌన్సిలర్ కోటేశ్వరరావు,జిల్లా ఎఫ్ డబ్ల్యూ ఎస్ డైరెక్టర్ కే.సుబ్బారావు మరి కొంతమంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - తడ: తడ మండలంలో కొన్ని పంచాయితీలలో పాఠశాలలను విలీనం చేసి ఐదు తరగతులకు ఐదు మంది ఉపాధ్యాయుల చొప్పున కేటాయించడంలో భాగంగా ఇటీవల బదిలీలు చేపట్టారు. నూతన ఉపాధ్యాయులు భర్తీ కాక ఒకరు ఇద్దరు టీచర్లతోనే ప్రస్తుతం విద్యాబోధన జరుగుతోంది. దీంతో ప్రభుత్వం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించేందుకు అనుమతించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ తరపున యంపీయస్ - భీములవారిపాలెం, వేనాడు, కాదలూరు, వాటంబేడు, కుప్పం, పూడికుప్పం, చినమాంబట్టు, పులివెంద్రలలో అకడమిక్ ఇన్స్ట్రక్టర్‌లను నియమించాల్సి అవసరం ఉందని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో యూటిఎఫ్ తడ అధ్యక్షులు కే రాంబాబు, ప్రధాన కార్యదర్శి యన్ రవికుమార్‌లు పాల్గొన్నారు.

20 మంది విద్యార్థులను
చితకబాదిన ఉపాధ్యాయుడు



విద్యార్థులను దండించిన వైస్ ప్రిన్స్‌పాల్ అశోక్ కుమార్, టీచర్ హరికృష్ణలను విచారిస్తున్న ఎంఆర్ఓ పద్మావతి



ఆదర్శ ఏకలవ్య గురుకుల పాఠశాల వద్ద విద్యార్థులను విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఓజిలి : తిరుపతి జిల్లా, ఓజిలి మండలం, వాకాటివారికండ్రిగ, ఆదర్శ ఏకలవ్య గురుకుల పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయులు విలువలు మరిచి విచక్షణ రాహితంగా ప్రవర్తిస్తూ, గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తికి కళంకంగా మారుతున్నారు. చిన్నపిల్లలని కూడా చూడకుండా ఒక్కరిద్దరు చేసిన తప్పిదానికి కోపోద్రిక్తుడైన ఒక ఉపాధ్యాయుడు హాస్టల్‌లోఉంటూ చదువుతున్న పిల్లలందరినీ చితకబాదిన సంఘటన గురుకుల పాఠశాలలో చోటుచేసుకుంది. ఏడవ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులను డ్రిప్ పైపుతో ఓ ఉపాధ్యాయుడు చితకబాది పిల్లలను గాయాల పాలు చేశాడు. ఆదివారం విద్యార్థులను చూసేందుకు వచ్చిన వారి తల్లిదండ్రులకు ఈ విషయం తెలియడంతో పాఠశాల వద్ద ఆందోళన చేశారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఓజిలి పోలీస్ స్టేషన్లో ఉపాధ్యాయుడు అరుణ్ కుమార్, హిందీ టీచరు హరికృష్ణలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఓజిలి ఎస్సై తెలిపారు. ఈ సంఘటనపై ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రైబల్ వెల్ఫేర్ కార్యదర్శి గౌతమ్ మేనన్, వైస్ ప్రిన్సిపల్ అరుణ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ ద్వారా తెలియజేశారు.

వివాదాస్పద భూమిపై విచారణ



గ్రామస్తులను విచారిస్తున్న తిరుపతి అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : బుచ్చినాయుడుకండ్రిగ, మండలం, నీర్పాకోట, కాంపాళెం గ్రామస్తుల మధ్య నెలకొన్న భూమి వివాదం, కేసులపై తిరుపతి అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసంహమూర్తి ఆదివారం విచారణ చేపట్టారు. గత వారంలో తిరుపతిలో జరిగిన ఎస్సీ, ఎస్టి మానిటరింగ్ కమిటీలో ఎమ్మెల్యే ఆదిమూలం దళితులపై అక్రమ కేసులు బనాయించి జైల్లో ఉంచారని, దళితుల భూములను అగ్రకులస్తులు కబ్జా చేస్తున్నా, అధికారులు పట్టించుకోవడంలేదని, విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేపట్టారు. ఇరు వర్గాల వారిని విచారించి సమాచారం సేకరించారు. ఎస్సీ కులానికి చెందిన గోపికృష్ణపై అటెంప్ట్ మర్డర్ కేసు బనాయించడంతో అతను జైలు శిక్ష అనుభవించి వచ్చారని, మరి అగ్రకులస్తులపై పెట్టిన కేసులు ఏం చేశారని ఎమ్మెల్యే నిలదీశారని తెలిపారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ వివాదాలకు సంబంధించిన భూమికి సంబంధించిన పత్రాలు చూపించమని అడిగారు. ఒక్కరి దగ్గర కూడా సంబంధిత పత్రాలు లేనందున సదరు 29 సెంట్లు భూమి ప్రభుత్వానికి సంబంధించిన భూమి అని, ప్రభుత్వ రికార్డుల ప్రకారం బుచ్చినాయుడుకండ్రిగ తహశీల్దారు శ్రీదేవి నిర్ధారించి, ఇప్పటికే భూమి వద్ద ప్రవేశం నిషేధం అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారని తెలిపారు. బాధితులు ఒకరిపై ఒకరు పెట్టుకున్న కేసులు మాత్రం పై విచారణలో పరిశీలించి ఎవరి ప్రక్క న్యాయం ఉన్నదో వారికి తగు న్యాయం చేస్తామని వారు హామీ ఇవ్వడం జరిగింది. జైలు శిక్ష అనుభవించిన దళిత కుటుంబాల వ్యక్తి తమకు న్యాయం చేయమని జిల్లాస్థాయి మండల స్థాయి అధికారులను ప్రాధాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీఐ తిమ్మయ్య, ఎస్ఐ హరిప్రసాద్, మండల సర్వేయర్ రాజ కుమార్, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులు అణచివేతకు గురవుతున్నాయి



మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మనుషులందరూ సమానమే, ప్రతి మనిషికి ఉన్న హక్కులను నేడు కాలరాస్తున్న పరిస్థితుల్లో సమాజంలో పౌర హక్కులపై ప్రజలను చైతన్యం చేయడానికి పౌర చైతన్య వేదిక ఆవిర్భావం చేశామని వేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు రాఘవ శర్మ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరుల హక్కులను తెలియజేయడం, దళిత గిరిజనులపై దాడులు అరికట్టాలని, సమానత్వం కోసం ప్రజలను చైతన్యం చేస్తూ ఏర్పడిన ఈ పౌర చైతన్య వేదిక రాష్ట్ర ప్రథమ మహాసభను ఈనెల 10వ తేదీన తిరుపతి నగర పరిధిలోని ఆఫీసర్స్ క్లబ్ వేదికగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ప్రముఖ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ హాజరవుతారన్నారు. ప్రపంచంలో స్వేచ్ఛాయుత వాతావరణాన్ని తీసుకురావడానికి కృషిచేస్తున్నామన్నారు. కొంతమంది నేరస్తులను పట్టుకుని రివార్డుల నగదు కోసం పట్టుబడిన వెంటనే కాల్చి చంపడం జరుగుతుందని, నేర నిరూపణ కోసం ఏర్పాటుచేసిన న్యాయవ్యవస్థ ఉండగా జీవించే హక్కు కలిగిన మనిషిని చంపడం దారుణం కాదన్నారు. ఇటువంటి సంస్కృతులను వీడనాడాలని కోరుకున్న వేదిక ఆశయం అన్నారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పౌరుహక్కులు వేదిక జిల్లా అధ్యక్షులు వాకా ప్రసాద్, కార్యదర్శి పరమేశ్వరరావు, కోశాధికారి హరీష్, కార్యవర్గ సభ్యులు షరీఫ్ పాల్గొన్నారు.

సెలవులు కేటాయింపులో ప్రభుత్వానికి వివక్ష తగదు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి గాను ప్రకటించిన సెలవుల జాబితాలో వివక్షత నిష్పక్షంగా కనబడుతోందని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షులు డేగల మహేష్ అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం మాట్లాడారు. గత ప్రభుత్వ ధోరణి కారణంగా నరక చతుర్దశి పండుగ సెలవును తొలగిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కార్మిక పౌర్ణమి సెలవును రద్దు చేయడం దారుణమన్నారు. ఒంటెద్దు పోకడలతో ప్రభుత్వం ఐచ్చిక సెలవుల జాబితాలో రథసప్తమి, నాగుల చవితి, వైకుంఠ ఏకాదశి, స్కంద షష్టి, గీతాజయంతి, నరక చతుర్దశి, రాఖీ పౌర్ణమి, వసంత పంచమి, అట్లతద్ది, గురు పౌర్ణమి, ఏరువాక పౌర్ణమి, తొలి ఏకాదశి, పరశురామ జయంతి, యమద్వితీయ, విశ్వకర్మ జయంతి, అక్షయ తృతీయ వంటి పండుగలను చేర్చాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రమాదేవి, మల్లీశ్వరి, మునిరామిరెడ్డి, లోకనాథం, వెంకటరమణ, శేషగిరిరావు, మాధవరావు పాల్గొన్నారు.

భానుప్రకాష్ రెడ్డి అవినీతిని బయట పెడతాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి ఆధ్యాత్మిక ముసుగులో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయన అవినీతిని బయట పెడతామని వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లాని బాబు తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డిపై నిత్యం నిందారోపణలు చేయడం భానుప్రకాష్ రెడ్డికి పరిపాటిగా మారిపోయిందన్నారు. ఆరోపణలకు ఆధారాలు చూపకుండా వేరే రాష్ట్రానికి వెళ్లి కన్నీళ్లు పెట్టుకుంటే నిజం అయిపోతుందా అని భానుప్రకాష్ రెడ్డిని ప్రశ్నించారు. భూమన కరుణాకర్ రెడ్డి సైన్యంగా చెబుతున్నామని, ఇక మీదట లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని, అందుకు తగ్గ విధంగా స్పందిస్తామని హెచ్చరించారు. భాను ప్రకాష్ రెడ్డి దళిత వ్యతిరేకి అని, ఏనాడైనా తన పార్టీలో ఉండే ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించిన సభ్యులకు శ్రీవారి విఐపి బ్రేక్ దర్శనాలు చేయించారా అని ప్రశ్నించారు. భానుప్రకాష్ రెడ్డి వలన భారతీయ జనతా పార్టీకి చెడ్డపేరు వస్తోందన్నారు. విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ అమర్నాథ్ రెడ్డి, తలారి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో క్రీడావైభవం



విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, చంద్రగిరి : నారాయణ పాఠశాలలో నారాయణ ప్రీమియర్ లీగ్ పేరుతో నిర్వహించిన క్రీడల పోటీలు ముగింపు సందర్భంగా క్రీడా వైభవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, వేలూరు జిల్లాలోని నారాయణ పాఠశాలల 10వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుమల వీజీవో ఎన్ టీవి. రామకుమార్ విచ్చేసి, విద్యార్థులకు క్రీడల పట్ల గల అభిరుచిని, క్రీడలు మానసిక వికాశానికి తోడ్పడుతాయని, విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండగలరని వివరించారు. నారాయణ పాఠశాలల కార్యనిర్వాహణాధికారి కొండల రావు మాట్లాడుతూ ప్రతి ఒక విద్యార్థి చదువుతో పాటు క్రీడల పట్ల, ఆటలపట్లు ఆశక్తిని పెంచుకోవాలని, క్రీడలు విద్యార్థులలో మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలియజేసారు. అనంతరం వివిధ రకాల క్రీడలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్ శ్రీనివాసులు, రవీంద్ర ఫణి కుమార్, రవికాంత్, గుప్తా, శ్రీలిలాధర్, అకడమిక్ కోఆర్డినేటర్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైయ్యర్ పెన్షన్ వర్తింపజేయాలి



సమావేశంలో ఏ.పీ.ఎస్.ఆర్టీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గూడూరు డివిజన్ అధ్యక్షులు బి.వి.రమణయ్య తదితరులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : హైయ్యర్ పెన్షన్ 01-09-2014 తేదీకి ముందు రిటైరయిన ఆర్టీసీ కార్మికులందరికీ వర్తింపజేయాలని ఏ.పీ.ఎస్.ఆర్టీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం గూడూరు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో, రెండవ మహాసభ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గూడూరు డివిజన్ అధ్యక్షులు బి.వి.రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.గంగాధర్ పాల్గొన్నారు. గూడూరు డివిజన్ పెన్షనర్ల సమస్యలపై కె.వి నారాయణ చర్చించారు. గంగాధర్ మాట్లాడుతూ ఇ.పి.ఎస్.పెన్షన్ రూ.9000, డి.ఎ, గ్రాట్యువిటీ, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ పథకాలు వర్తింపజేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గౌరవాధ్యక్షులుగా జి.జె.గోపి, గౌరవ సలహాదారుగా ఎం.శేషయ్య, అధ్యక్షులుగా బి.వి.రమణయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్.రత్నం, ఉదయ భాస్కర్, డి.తిరుపాలు, కె.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.వి.నారాయణరావు, సహాయ కార్యదర్శిగా కె.రాజయ్య, పి.మనోహరం, నాగూరయ్యా, టి.విజయలక్ష్మి, ట్రెజరర్‌గా వై.హరినాథ్, కమిటీ సభ్యులు సి.హెచ్.పెంచలయ్య, కె. తిరుపతమ్మ, కే.రమణమ్మ, వి.గిరిలను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి నెల్లూరు జిల్లా కార్యదర్శి ఎం.ఆర్.రెడ్డి, గౌరవ సలహాదారులు శంకరయ్య, చంద్రమౌళి, వి.పి.నరసింహారెడ్డి, రామసుబ్బయ్య, తిరుపతి డివిజన్ రాష్ట్ర కార్యదర్శి బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి కింద మంజూరైన నగదు చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. 23 లక్షలా 74 వేలా 944 రూపాయల నగదు చెక్కులను అనారోగ్య బాధితులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, శివ కుమార్, రహీమ్, బిల్లు చెంచు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వేలాయుధం ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి - పాకాల: పాకాల మండలం, ఊట్లవారిపల్లి, పాళ్యం కొండపై నెలకొన్న శ్రీ వళ్లి దేవర సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం అభివృద్ధిలో భాగంగా వేలాయుధం నిర్మాణానికి ఆదివారం ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు దేవాలయ అభివృద్ధిలో భాగంగా ఇప్పటికే కళ్యాణ మండపాలు, 50 అడుగులు ఎత్తు ఉన్న సుబ్రహ్మణ్య స్వామి విగ్రహం, దేవాలయం వరకు చెరువు కట్టపై డబల్ రోడ్డు నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆలయ బోర్డు మెంబర్లతో పాటు పలువురు టీడీపీ నాయకులు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.

జిఎస్టిపై ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రచారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ 7 రోజుల ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. దీనిలో భాగంగా 3వ రోజుల పాటు జీఎస్టీపై గ్రామాల్లో అవగాహన కల్పించారని ప్రిన్సిపల్ ఎస్వీ కుమార్ తెలిపారు. పిల్లారుపట్టు పరిసర ప్రాంతలైన చౌటూరు, తాయిమాంబపురం గ్రామాలల్లో అవగాహన కార్యక్రమా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సాగర్ రెడ్డి, అవుట్సోర్సింగ్ స్టాప్, అంగన్వాడీ టీచర్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయ బోర్డ్ మెంబర్‌గా పద్మజాలత ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - పాకాల : కాణిపాక బోర్డు మెంబర్‌గా పాకాలకు చెందిన శ్రీమతి పద్మజా లతా కనక రాజన్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. పాకాల మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఆదివారం కాణిపాక ఆలయంలో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పద్మజా లతకు పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు అభినందనలు తెలిపారు. పద్మజా లత మాట్లాడుతూ టీడీపీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల అభివృద్ధికి ముందు ఉంటానని తెలిపారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టి, పర్యావరణ పరిరక్షించుకుందామని విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. స్థానిక తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్లో ఫోర్త్ చిల్డ్రన్స్ సైన్స్ ఫెస్టివల్ ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులు ఈ భూమి మన అందరిదీ ప్లాస్టిక్ భూతానిది కాదు అనే నాటకాన్ని ప్రదర్శించారు విద్యార్థులు జయశ్రీ, నందన, శ్రీ ముని, రిషికేష్, తేజస్విని, డేవిడ్, చక్షిత శర్మ, జీత, జోన్స్ చక్కటి నటనతో ప్రశంసలు అందుకున్నారు. నాటక దర్శకులు, ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదర్ భాషా మంచి సందేశాన్ని ఇచ్చారని నిర్వాహకులు నడ్డి నారాయణ, తహసునిస బేగంలు ప్రశంసించారు. విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్లో హైడ్రాలిక్ జెసిబి, వాటర్ ట్యాంక్ లెవల్ ఇండికేటర్ ప్రాజెక్టులను ప్రదర్శించి మన్ననలు పొందారు.

ఆదివారం కూడా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి - పాకాల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఎస్ఎస్‌సి విద్యార్థుల 100 రోజుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం కూడా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలైంది. వివరాల్లోకెళ్తే 2025 - 26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థుల పరీక్షా ఫలితాలు 100% సాధించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వందరోజుల కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోందని పాకాల యంఈవో బాబ్జి తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న వందరోజుల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని సంతృప్తి వ్యక్తం చేశారు.

వైసీపీ సంస్థాగత కార్యదర్శిగా తిరువేంగడం


ప్రజాశక్తి - పిచ్చాటూరు, పుత్తూరు: తిరుపతి జిల్లా వైసీపీ సంస్థాగత కార్య దర్శిగా నారాయణవనం మండలం, తిరువట్యం పంచాయతీకి చెందిన వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు తిరువేంగడంను వైసిపి అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాపై నమ్మకం ఉంచి పదవి ఇచ్చినందుకు పార్టీ అధిష్టానానికి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఆర్ఎస్ఎస్, బీజేపీ కుట్రలు సాగనివ్వం




ప్రజాశక్తి - తిరుపతి సిటీ: బిజెపి కుట్రలతో దేశం ముక్కలు కాకుండా కాపాడుకుంటామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య పేర్కొన్నారు. బైరాగి పట్టెడ, గంధమనేని శివయ్య భవనంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో అయన మాట్లాడారు. మనువాద రాజ్యాంగం తీసుకురావాలని ఆర్ఎస్ఎస్-బిజెపి కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. కమ్యూనిస్టులుగా మా దేహాలు ముక్కలైనా దేశాన్ని ముక్కలు చేయనివ్వమని ఉద్ఘాటించారు. అమరావతి రాజధాని పేరుతో మళ్లీ లాండ్ పూలింగ్‌కు పిలుపు ఇచ్చిన సీఎం చంద్రబాబుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాయలసీమ వంటి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి మరచి అమరావతిపైనే దశల వారీగా ఖర్చులు పెడుతున్నారని విమర్శించారు. పోలవరం, కడప స్టీల్ ప్లాంట్‌లు ముందుకు సాగడం లేదన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. రామానాయుడు రైతుల సమస్యలు ప్రస్తావించారు. మామిడికాయల రైతుల నష్ట పరిహారం పూర్తిగా అందలేదన్నారు. కల్తీ నెయ్యి, పరకామణి చోరీలను రాజకీయాలకు వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య పాల్గొన్నారు.

గంధ మహోత్సవంలో అన్నదానం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గేట్ పుత్తూరు, అనంబట్టు రోడ్డు, ఖాదర్ వలి దర్గాలో మహమ్మద్ నబి ఆధ్వర్యంలో శుక్రవారం నుండి నిర్వహిస్తున్న గంధ మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మందికి పైగా అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో పుత్తూరు పట్టణ ప్రధాన కార్యదర్శి యన్‌యన్ ధనపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ డియస్ గణేష్, చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి మహమ్మద్ నబి, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, బావాజీ, వసీమ్, శంసు, కరీం అలీషా, అమీర్ జాన్, యాక్బుల్, రహీమ్ పాల్గున్నారు.

మధుకు మేమంతా అండ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కన్నతల్లిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు, ఆక్స్ ఫర్డ్ విద్యా సంస్థల అధినేత చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డికి తాము అండగా ఉంటామని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఆదివారం పుల్లారెడ్డి కండ్రిగలో జరిగిన చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి తల్లి జయమ్మ అంత్యక్రియల్లో బియ్యపు మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. జయమ్మకు నివాళులు అర్పించారు. మధుసూదన్ రెడ్డిని ఓదార్చి ధైర్యం చెప్పారు. త్వరగా ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించారు. వైసీపీ నేతలు అంజూరు శ్రీనివాసులు, ఉన్నం వాసుదేవ నాయుడు, వయ్యాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్నెరెడ్లకు వన్నె తీసుకురారా..!!




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అతిపెద్ద సామాజిక వర్గంగా, ఓటు బ్యాంకుగా ఉంటూ కూటమి గెలుపులో కీలక భూమిక పోషించిన వన్నెరెడ్లకు పదవులు, రాజకీయపరంగా చెప్పుకోదగ్గ ప్రాధాన్యత దక్కలేదని టిడిపి బీసీ విభాగం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పొన్నాలమ్మ గుడి ఆవరణలో ఆదివారం వన్నెకుల క్షత్రియ నేతలు సమావేశమయ్యారు. ఎన్నికల ముందు వన్నెరెడ్లకు ఇచ్చిన ఏ హామీ కార్యరూపం దాల్చలేదని వాపోయారు. యువగళం పాదయాత్ర సందర్భంగా యువనేత నారా లోకేష్ బాబు బండారుపల్లి, వెంకటాపురం మధ్య వన్నెకుల క్షత్రియ సోదరులతో ఆత్మీయ సమావేశం పెట్టి వారికి రాజకీయంగా సముచిత ప్రాధాన్యత ఇస్తామనీ, ఎమ్మెల్సీ, లేకుంటే ట్రస్ట్ బోర్డు చైర్మన్, అదీ కాకుంటే తుడా చైర్మన్‌గా అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు దాటిపోయినా, శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా నామినేటెడ్ పోస్టులు భర్తీ అయిపోయినా వన్నెరెడ్లకు న్యాయం జరగలేదని విచారం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి జనాభా దామాషా ప్రకారం పదవులు ఇస్తామని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూడా నేతలు గుర్తు చేసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు వన్నెరెడ్లకు వన్నె తెచ్చేలా రాజకీయంగా ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, రాష్ట్ర వన్నె కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, పేట బాలాజీ రెడ్డి, దొరై రాజు రెడ్డి, ముని రెడ్డి, సోయిండి.ఈశ్వర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, మురళి, గంగిరెడ్డి, నాగరాజా, మస్తాన్ రెడ్డి, శివారెడ్డి, మునెయ్య, మునిసుబ్బారెడ్డి, ఆనంద్ రెడ్డి, పురుషోత్తం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సిల్వర్ జూబ్లీకి పురందేశ్వరికి ఎంజీఎం ఆహ్వానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఎంజీఎం విద్యా సంస్థల సిల్వర్ జూబ్లీ వేడుకలకు మాజీ మంత్రి, రాజమండ్రి ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ఐశ్వర్య లక్ష్మి దంపతులు ఆహ్వానించారు. ఆదివారం హైదరాబాదులోని దగ్గుపాటి నివాసంలో మయూర్ దంపతులు పురందేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి సిల్వర్ జూబ్లీ ఆహ్వాన పత్రికను అందజేశారు. 2001లో బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, నారా రామమూర్తి నాయుడు చేతుల మీదుగా ప్రారంభమైన ఎంజీఎం విద్యాసంస్థలు 25 సంవత్సరాలు పూర్తి చేసుకుని నేడు సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటున్న మయూర్ తెలిపారు. ఇటీవల నారా రామ్మూర్తి నాయుడు కుమారుడు సినీ హీరో నారా రోహిత్ దంపతులు సిల్వర్ జూబ్లీ వేడుకలు లాంఛనంగా ప్రారంభించినట్లు చెప్పారు. 2026 జనవరి నెలాఖరున జరిగే అతి పెద్ద వేడుకకు తమరు రావాలని విజ్ఞప్తి చేశారు.

పేద విద్యార్థినికి ల్యాప్ టాప్ వితరణ



ప్రజాశక్తి -కోట : కోట పట్టణానికి చెందిన శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో దాతల దాతృత్వంతో ఆదివారం ఓ పేద విద్యార్థినికి ల్యాప్ టాప్ అందజేశారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన తాళ్లమాపురం సునీత కుమార్తె నందిని గంగవరంలో గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీలో రెండో సంవత్సరం చదువుతోంది. ఆమె చదువుల కోసం ల్యాప్ టాప్ అవసరమని తెలుసుకున్న శ్రీ షిరిడి సాయి అక్షయ సేవా సమితి అధ్యక్షుడు అల్లం రమణయ్య నెల్లూరుకు చెందిన కే.భాస్కర్ రెడ్డి, సుబ్బరాయుడు, ఆర్.వెంకటేశ్వర్లు, ఆర్.చంద్రాచారి, చెన్నైకి చెందిన నవీన్ బాబు, గిరిధర్ రెడ్డిల దాతృత్వంతో 50వేల రూపాయలు సమాకూర్చి ల్యాప్‌టాప్ కొనుగోలు చేసి విద్యార్థిని నందినికి అందజేశారు. ఔదార్యం చాటిన దాతలకు అల్లం రమణయ్య, విద్యార్థిని కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

విద్యానగర్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -కోట : రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలు అవుదామని ఎంవీ.రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం కోట మండలం, విద్యానగర్‌లో విద్యా ప్రదాత స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మిల జ్ఞాపకార్థం ఎం.వి.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ కార్ వాష్ సెంటర్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని మేడిపల్స్ రక్తనిధి కేంద్రం ఇంచార్జ్ ఎం.సురేష్, పలగాటి సాయి రెడ్డి ప్రారంభించారు. ముందుగా ముప్పవరపు వెంకటేశ్వరరావు, ముప్పవరపు ఆదిలక్ష్మి చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. డిసెంబర్ 7 న భారత సైనిక దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, దేశవ్యాప్తంగా ఉన్న భారతదేశ సైనికులకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం రక్తదాతల నుంచి గూడూరు పట్టణానికి చెందిన మేడి పల్స్ రక్తనిధి కేంద్రం వారు రక్తాన్ని సేకరించారు. రక్తదాతలకు సర్టిఫికేట్‌తో పాటు మెడిపల్స్ కిట్, జ్యూస్, పండ్లు, బిస్కెట్‌తో పాటు ఫ్లాస్కోను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, వేమారెడ్డి షనీల్ రెడ్డి,పలగాటి సాయిరెడ్డి రక్త దాతలు మెడిపల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ ధర్మారెడ్డి సేవలు అమూల్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండల పోలీస్ స్టేషన్ ఎస్సైగా గత ఐదేళ్లుగా పనిచేస్తూ, రేణిగుంటకు బదిలీపై వెళ్తున్న ఎస్సై ధర్మారెడ్డికి నూతన ఎస్సై హరీష్, పోలీస్ సిబ్బంది, స్థానిక నాయకులు, ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భగా ధర్మారెడ్డిని ఘనంగా సత్కరించారు.

యథేచ్ఛగా పార్కింగ్.. తప్పని ట్రాఫిక్ తిప్పలు



ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : పుత్తూరు పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఇటీవల నూతనంగా ప్రారంభమైన కాసం ఫ్యాషన్ షోరూం వద్ద నిర్లక్ష్యంగా ద్విచక్రవాహనాలు పార్క్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. షోరూమ్ ముందు విచ్చలవిడిగా వాహనాలు నిలిపేయడంతో విద్యార్థులకు, పాదచారులకు, వాహనదారులకు, ముఖ్యంగా 108 అంబులెన్స్ రాకపోకలకు పెద్ద ఎత్తున ఆటంకం కలుగుతోంది. పార్కింగ్ సమస్య గురించి షోరూం యాజమాన్యాన్ని నివాసితులు ప్రశ్నించినప్పటికీ, తమకు ఎటువంటి సంబంధం లేదనే నిర్లక్ష్య సమాధానం వస్తోంది. షాపింగ్ హడావిడితో ఆ ప్రాంతమంతా రద్దీగా మారిపోగా, బాధపడేది మాత్రం ప్రజలేనంటూ స్థానికులు విమర్శిస్తున్నారు. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని, రహదారి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రద్దీ ప్రాంతంలో నిర్లక్ష్యపూర్వక పార్కింగ్ కొనసాగితే ఏ క్షణంలోనైనా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

రైతుకు మద్దతుగా నిలబడదాం




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఆధునిక వ్యవసాయం, మార్కెటింగ్, మద్దతు ధర అంశాల్లో రైతుకు మద్దతుగా నిలబడదామని శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు పిలుపునిచ్చారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర ఏఎంసీ చైర్మన్ల ఆత్మీయ సమావేశంలో రంగనేని మాట్లాడారు. తాజా వ్యవసాయ విధానాలు, మార్కెట్ అభివృద్ధి మార్గదర్శకాలు, రైతుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి తీర్థ ప్రసాదాలను, కలంకారి వస్త్రాలను బహూకరించారు.

పరుపులు, దిండ్లు, దుప్పట్లు వితరణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస అధ్వర్యంలో తిరుపతి పట్నాల్ వీధిలోని పట్టణ నిరాశ్రయుల బస కేంద్రంలోని నిరాశ్రయులకు పరుపులు, దిండ్లు, దుప్పట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవలో భాగంగా నిరాశ్రయుల బస కేంద్రానికి పరుపులు, దిండ్లు, దుప్పట్లు ప్రపంచ ప్రసిద్ధిగాంచిన సేవాసంస్థ లయన్స్ క్లబ్ చే నిరాశ్రయులకు సహాయంగా నిలబడటం ఆనందంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేయుటకు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, జగన్నాథం, శాంతినాడార్, ఈశ్వర్ రెడ్డి, శేషాద్రి, బస కేంద్ర నిర్వాహకులు మునికృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

మనిషిని సన్మార్గం వైపు నడిపించే ఆయుధం భగవద్గీత

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మానవ సమాజాన్ని సన్మార్గంలో నడిపే శక్తి భగవద్గీతకు ఉందని హెచ్డిపిపి కార్యదర్శి శ్రీరాం రఘునాథ్ పేర్కొన్నారు. టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతి, అన్నమాచార్య కళామందిరంలో భగవద్గీత శ్లోకాల కంఠస్తం పోటీల్లో విజేతలకు ఆదివారం ఉదయం బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కోణంలో మనిషి ఎలా జీవించాలో భగవద్గీత తెలియజేస్తుందన్నారు.అనంతరం గీతా జయంతి వేడుకల్లో మొదటి విభాగంలో ప్రథమ బహుమతి కెపి ముకుంద, ద్వితీయ బహుమతి కేపీ శ్రీ, తృతీయ బహుమతి ఎం వైష్ణవి పొందారు. రెండవ విభాగంలో డి నిశాంత్ చక్రవర్తి, ఎం జస్వంత్, ఎస్ నాగవేణి, మూడవ కేటగిరీలో పీహెచ్ వెంకటనారాయణ, ఎం లహరి, ఎస్ ఉమామహేశ్వరి బహుమతులు గెలుపొందారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



ప్రజాశక్తి -కోట : ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా కోట మండలంలో పలువురికి అందజేశారు. కోట మండలం, నెల్లూరుపల్లి, కొత్తపాలెం నేదురుమల్లి స్వరూపకు రూ.20,000, కేశవరం గ్రామం ఉల్లిపాయల మల్లికార్జున్‌కు రూ.25000, కొక్కుపాడు గ్రామానికి చెందిన ఎంబేటీ నాగార్జున్‌కు రూ.30785, తిన్నెలపూడి గ్రామానికి చెందిన కర్లపూడి ఆదామయ్యకు రూ.41084, కోట గ్రామానికి చెందిన రాయపు ఉషకు రూ.37,292, మద్దాలి గ్రామానికి చెందిన కూరపాటి రామానాయుడుకు రూ.42200, వెంకన్నపాలెం గ్రామానికి చెందిన మండపాటి శ్రీలక్ష్మికి రూ.27114 రూపాయలను కోట మండల టిడిపి మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్ రెడ్డి, తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ ,నెల్లూరు మోహన్ రెడ్డి, కోకర్ల మధు యాదవ్, యానాటి నారాయణ చేతుల మీదగా అందజేశారు.

ఆకట్టుకున్న నృత్య, కళా పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ రెండవ దశ అంతర కళాశాల క్రీడా సాంస్కృతిక పోటీలలో భాగంగా మూడవరోజు జరిగిన నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్ తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చదరంగం వంటి విభాగాలలో విద్యార్థిని, విద్యార్థులు పోటీపడి తమ ప్రతిభను కనబరిచారు. ఉదయగిరి వ్యవసాయ కళాశాల 100 మీటర్ల పరుగు పందెంలో తాడిపత్రి వ్యవసాయ కళాశాల, 200 మీటర్ల పరుగు విభాగంలో ఎస్వీ వ్యవసాయ కళాశాల విజేతలుగా నిలవడం జరిగిందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవికాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి వ్యవహారాల ఇంచార్జ్ డాక్టర్ కే హరిప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మంగాపురంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలంలోని శ్రీనివాస మంగాపురం శ్రీ వస్కోటాలమ్మ దేవాలయము నందు అమెరికన్ నేత్ర వైద్యశాల వారిచే ఉచిత వైద్య శిబిరము నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీనివాసమంగాపురం, పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఆలయ కమిటీ అధ్యక్షులు అంతరాజి చంద్రశేఖర్, గ్రామ ప్రజలు గడ్డపార మునికృష్ణారెడ్డి, అంతరాజి కళావతి, పూల సురేష్ యుగంధర్, నవీన్, కుమార్, తేజ, చంద్రిక,కార్తీక్, పేరాల వెంకటేష్, తొర్రూరు సుధాకర్, మొదలగు వారు పాల్గొన్నారు.

గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరును జిల్లా కేంద్రం చేయాలని, లేని పక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని జెఎసి కన్వీనర్ దశరథరామి రెడ్డి తదితరులు కోరారు. గూడూరు పట్టణంలోని గడియారం స్తంభం వద్ద జెఎసి అధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభించారు. గూడూరును జిల్లా చేయాలంటూ గత కొద్ది రోజులుగా నియోజకవర్గ స్థాయిలో నిరసనలు జరుగుతున్నాయి. అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజలు తమ వంతు మద్దతు ప్రకటించారు. ఈ క్రమంలో జె.ఎ.సి అధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభమయ్యాయి. ఆదివారం జెఎసి ప్రతినిధులతో పాటు ఉద్యోగులు, స్వచ్ఛంధ సంస్థలు, ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులు దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెఎసి ప్రతినిధులు వేగూరు రాజేంద్ర ప్రసాద్, నాగేశ్వర రావు, విజయకుమార్, భాస్కర్ గౌడ్, శ్రావణ్ కుమార్, రవి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డు పనులు పున: ప్రారంభం



ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : గూడూరు-వెంకటగిరి రహదారి పనులు కొన్ని నెలలుగా నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికులు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పురోగతిలేదు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు మొదలు పెట్టాలని, లేదంటే బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. దీంతో కాంట్రాక్టర్ మళ్లీ పనులు మొదలుపెట్టారు. స్థానికులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం న్యూస్

వాహనంతో సహా ఎర్రచందనం స్వాధీనం



ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: భాకరాపేట, చామల రేంజి అటవీ శాఖ సిబ్బంది జరిపిన దాడిలో ఒక వాహనంతో సహా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు అటవీ క్షేత్ర అధికారి వెంకటరమణ విలేకరుల సమావేశంలో తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం, మంగళంపేట మీదుగా తమిళనాడుకు ఎర్రచందనం తరలిస్తున్నట్లు రహస్య సమాచారం అందడంతో వెంటనే అప్రమత్తమై భాకరాపేట మంగళంపేట రోడ్డు, పూజారి వాండ్లపల్లి, రెడ్డి చెరువు దగ్గర వాహనాలను తనిఖీ చేస్తుండగా శనివారం కొందరు కారును వదిలి చీకట్లో పారిపోయారు. కారును పరిశీలించగా 161 కేజీల తొమ్మిది ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. వాహనం, ఎర్రచందనం దుంగల విలువ సుమారు 10 లక్షలు వరకు ఉంటుందని తెలిపారు. ఈ దాడిలో ఎఫ్బిఓలో ఎం.సదాశివయ్య, వై. రాజేష్ కుమార్, జే.బీ.నిఖిల్, డ్రైవర్ ఎన్.రోహిత్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు. కేసు నమోదు చేసి పారిపోయిన స్మగ్లర్ల కోసం ముమ్మరగాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

కారు పల్టీ.. అయ్యప్ప భక్తులకు గాయాలు




ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలంలోని అగరాల, నారాయణ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శబరిమలై దర్శనం చేసుకుని తమ స్వగ్రామమైన రైల్వే కోడూరుకు తిరిగి వెళ్తున్న అయ్యప్ప భక్తులు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. డ్రైవర్ నిదుర మత్తులో నడిపిన కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టి పల్టీలు కొట్టింది. కారులో మొత్తం ఆరుగురు అయ్యప్ప భక్తులు ప్రయాణిస్తున్నారు. సాయికుమార్ (25) అనే భక్తుడి తలకు బలమైన గాయం తగలడంతో అతని పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన ఐదుగురు భక్తులు అజయ్ కుమార్ (28), జస్వంత్ (32), మణికంఠ (20), నితీష్ (20), యోగేష్ (20) స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన స్థానికులు, సహాయక బృందాలు క్షతగాత్రులను 108 వాహనం ద్వారా అత్యవసర చికిత్స కోసం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


ప్రజాశక్తి - రేణిగుంట : తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, గాజులమండ్యం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు మంజునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పోలీస్ సిబ్బందికి 36 హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం స్టాఫ్ వెల్ఫేర్‌లో భాగంగా, రోడ్ సేఫ్టీపై అవగాహన పెంపొందించడానికి నిర్వహించబడింది. ఈ సందర్భంగా, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయాలన్నారు.

గాదంకి టోల్ గేట్‌లో గందరగోళం



ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, గాదంకి టోల్ గేట్ సిబ్బంది తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు, వాహన చోదకులు ఆదివారం ఆందోళనకు దిగారు. విఐపీలనే పేరుతో తమకు ఇష్టం వచ్చిన వారిని ఒక దారిలో పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విధుల వాహనం అని ఉన్నా, అధికారుల గుర్తింపు కార్డు చూపినా సిబ్బంది వ్యవహరించే తీరు దారుణంగా ఉందని పలువురు ఆందోళనకు దిగారు. అధికారులు కారులో లేరు? ఉంటే దిగి కనపడమను అంటూ అవహేళన చేస్తుండంతో కొంతమంది (పేరు చెప్పని) అధికారులు కారును టోల్ గేట్‌లో ఆపేసి దూరంగా వెళ్లిపోవడం జరిగింది. లోకల్‌గా ఉన్న వారి పట్ల సిబ్బంది దురుసుగా వ్యవహరిస్తున్నారని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికమైన ఆధార్ కార్డు చూపినా, లోకల్ అయితే నీకు కొమ్ములు వచ్చాయా అని హేళనగా మాట్లాడుతున్నారని తెలిపారు. జాతీయ రహదారుల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని స్థానికులకు, విఐపీలకు ప్రత్యేక మార్గం చూపాలని కోరుతున్నారు.

విద్యార్థుల విజయమే లక్ష్యం



ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడుకండ్రిగ మండలం, పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి విద్యార్థుల 100 డేస్ ప్రోగ్రామ్‌ను, ప్రత్యేక తరగతులను రెవెన్యూ అధికారి శ్రీదేవి, మండల విద్యాధికారి కె.రవీంద్రనాథ్‌లు పరిశీలించారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు రెగ్యులర్ ప్రాక్టీస్, మోడల్ పేపర్ల ఆభ్యాసం, సందేహ నివృత్తి సమయాల పెంపు, ప్రత్యేక దృష్టి అవసరమైన విద్యార్థులపై గురువులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పీలు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE COURT: TIRUPATHI.
I.P. No.6 / 2022
Adivanee Rajeswari ...Petitioner
V/s
M.Gayathri and others ...Respondents
NOTICE TO RESPONDENTS NO.4, 8, 11 & 12
R-4) N. Neelaveni W/o Dhamodharam,, residing at 4-4-1032, Nehru Nagar, Tiruathi town and Mandal, Tirupathi District,
R8) D.Manjula W/o D.Chandra,, residing at 4-4710, Near Bhramhagari temple, Nehru Nagar, Tiruathi town and Mandal
R11) Sankaraiah C/o Sankariah provisions, Nehru Nagar, kavamatemple beside, Tirupathi towna and Mandal
R12) S. Narayana S/o S. Srinivasulu, residing at D.No. 22-77, Srinagar Colony, M.R.Palli, Tirupthi town, Tirupathi district.
Notice is hereby given Under Section 19(2) of the Provincial Insolvency Act that the Petitioner has applied to this court praying to adjudge him as Insolvent and that the said petition stands posted to 19-01-2026 for hearing. If you got objections you may appear before this court at 10.30 am either in person or through an advocate and file your objections. if you fail to do so, the matter will be decided exparte.
Y.B.S. BAPUJEE
Advocate, Tirupati

IN THE COURT OF HONORABLE CIVIL JUDGE (SENIOR DIVISION), SRIKALAHASTI
Creditors I.P. NO. 28/2024
Kandati Muralidhara Reddy ...Petitioner
V/s
Vaddhi Raghu Ram & another ...Respondents
NOTICE TO RESPONDENT No.1
R1) Vaddhi. Raghuram S/o Late V. Chalapathi Naidu, Door No.16/720, Sri Ram Nagar Colony, (opposite to Vijetha School), Panagailu, Srikalahasti Town, Tirupati District.
Please take notice in the above I.P.NO.28/2024 is filed by the petitioner against you on the file of Honourable Senior Civil Judge, Srikalahasti for setting aside the registered sale deed dated 23-10-2024 and the said I.P. is posted to Dt.18-12-2025 for your appearance. Hence either you or through your advocate attend on 18-12-2025 before aforesaid Honourable Court by 10-30 A.M. and file your objection if any otherwise said I.P. will be decided on exparte
By Court Order
V.MUNIKRISHNAIAH
ADVOCATE FOR PETITIONER
SRIKALAHASTI